'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## 'రియల్' మందగమనం

**రాష్ట్రంలో** రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం గురించిన మాటలు ఈ మధ్య తరచుగా వినబడుతున్నాయి. ధరల హెచ్చుతగ్గుల గురించిన చర్చలు కూడా జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన డిసెంబర్ నెల నుంచే ఈ తరహా ధోరణులు ప్రస్ఫుటంగా ముందుకురావడం గమనార్హం. పదేండ్ల పాటు పైపైకి ఎగిసిన తెలంగాణ రియల్ రంగానికి ఒక్కసారిగా బ్రేకు వేసినట్టయింది. రాష్ట్రంలో లక్షలాదిమంది ఆధారపడిన రియల్టీకి బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక, వాణిజ్య విధానాలు గొప్ప ఊపు కల్పించాయి. ప్రభుత్వ మార్పుతో సెంటిమెంటులో తేడాలు వచ్చాయనేది పరిశీలకుల మాట. గత మూడు మాసాల వ్యవధిలో రిజిస్ట్రేషన్లు సుమారు 15 నుంచి 40 శాతం దాకా పడిపోవడంతో తదనుగుణంగా ప్రభుత్వ ఆదాయమూ తగ్గిపోయింది. మార్కెట్లో ఇలా స్తబ్ధత ఏర్పడిన ప్రస్తుత సమయంలో పులి మీద పుట్రలా ప్రభుత్వం భూముల విలువను సవరించాలని, స్టాంప్ డ్యూటీని పెంచాలని ఆలోచిస్తుండటం రియల్టీపై పిడుగుపాటులా మారింది..

రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గడం, పథకాల ఆర్థిక భారం నేపథ్యంలో ఆదాయం పెంచుకునే మార్గంగా ప్రభుత్వం రియల్టీని ఎంచుకున్నదనేది స్పష్టమే. అయితే మందగమన పరిస్థితుల్లో రేట్ల పెంపు అనేది ప్రతికూల ప్రభావం చూపిస్తుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రెండున్నర నెలలుగా మార్కెట్ తీవ్రమైన తిరోగమనంలో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలు చేపట్టడం ఏరకంగానూ సమర్థనీయం కాదనేది వారి వాదన. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ఏర్పడితే 2021 దాకా రేట్లను ముట్టుకోలేదు. రియల్ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) దాటి విస్తరించి, మార్కెట్‌లో బూమ్ ఏర్పడిన తర్వాతనే స్వల్పంగా రేట్లు పెంచారు. ఆ తర్వాత 2022లో మరోసారి రేట్లను సవరించినప్పటికీ క్రయవిక్రయాలపై వాటి ప్రభావం పెద్దగా పడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయిందన్న అసహనంతో రేట్ల సవరణకు పూనుకోవడం విమర్శలకు గురవుతున్నది. రాష్ట్రంలో రియల్ బూమ్ తగ్గడాన్ని స్థూలంగా పరిశీలిస్తే వ్యవసాయంతో పాటుగా అన్నిరంగాల్లో సంక్షోభ పరిస్థితులు ఏర్పడటం, కొత్త ప్రభుత్వం స్థిరత్వం గురించిన సందేహాలు, విధానాలపై స్పష్టత కొరవడటమూ కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఇబ్బడిముబ్బడిగా లే ఔట్లు, ప్లాట్లు, ఇండ్లు అందుబాటులోకి వస్తున్నప్పటికీ అవసరమైనవారు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. మరోవైపు అవసరం లేనివారు రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడిమార్గంగా ఎంచుకోవడం జరుగుతున్నది. డిమాండ్ తగ్గిపోవడంతో పెట్టుబడులు పెట్టినవారు ఇరుక్కుపోతున్నారు. మధ్యతరగతి పెరిగినందువల్ల కొంతమేరకు డిమాండ్ కొనసాగుతున్న మాట వాస్తవం. కానీ అది ఏ మూలకు సరిపోదు. ఏ రకంగా చూసినా ప్రస్తుతం కొనిపెట్టుకునే సమయం తప్ప అమ్మకానికి సరైన అదను కాదనేది వాస్తవం. తెలంగాణలో ఏర్పడిన స్తబ్ధత ఇప్పుడప్పుడే తెరిపినపడే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం కుదురుకుని దిద్దుబాట్లు చేపట్టకపోతే మరి కొన్నేండ్లు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు దండిగా కనిపిస్తున్నాయి. మళ్లీ మంచిరోజుల కోసం సుదీర్ఘ నిరీక్షణ తప్పదు!

# పరిశ్రమలే ఆర్థిక సోపానాలు

బి.నర్సన్
94401 28169

**రాష్ట్ర మౌలిక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అనేవి తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు రైలు పట్టాల్లాంటివి. ఈ రెండింటి మధ్య సమన్వయం లోపిస్తే ప్రభుత్వాలు ఆర్థికంగా దివాళా తీయక తప్పదు. అయితే ఎన్నికల్లో గెలుపోటముల దృష్ట్యా రెండో దానికే పార్టీలు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తాయి. వాటికీ లక్ష్మణరేఖలు గీసుకుంటేనే పార్టీలకు, ప్రజలకు శ్రేయస్కరం. రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆర్నెళ్లకే కుడితిలో పడ్డ ఎలుక చందం తిప్పలు పడుతుంటే అలవికాని హామీల ఉచ్చు ఎలా ఉంటుందో తెలుస్తున్నది.**

మంత్రిమండలిలో చర్చించకుండానే మన ముఖ్యమంత్రి అధికారుల చేతులు పట్టుకొని ఎలాగైనా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచండని ఆదేశిస్తున్నారు. ఎంత పన్నులు, ధరలు పెంచినా హామీల గోతం నించి నిండదు. ఈ హామీలు మమ్మల్ని అడిగి ఇచ్చారా అని అధికారులు మాత్రం అడగలేరు. అయితే, మరోదారి లేక అడ్డదిడ్డంగా పన్నులు, చార్జీలు పెంచితే ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ఇతర రంగాల అభివృద్ధిపై దాని ప్రభావం పడుతుంది.

సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వాలు చేయూతనిస్తూనే మరోవైపు తన ఆదాయాన్ని పెంచే మార్గాలను తప్పకుండా వెతుక్కోవాలి. ఆదాయ వృద్ధికి పన్నుల పెంపు, భూముల అమ్మకం పరిష్కారం కానే కాదు. అందుకు పారిశ్రామికాభివృద్ధియే దివ్యమైన మార్గం. అది ఉద్యోగ కల్పనతో పాటు రాష్ర్టానికి పలురకాల ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. దీని వల్ల ఉపాధి మార్గాలు పెరిగి రాష్ట్రంపై సంక్షేమ పథకాల భారం క్రమంగా తగ్గుతుంది. నిజానికి గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విజన్‌తోనే ప్రణాళికలు రచించింది. దేశ, విదేశీ కంపెనీల రాక కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఎన్నో విజయాలను సాధించింది. కొత్త పరిశ్రమల ఉత్పత్తి మొదలైె లక్షలాది యువతకు ఉపాధి లభించడంతో ఎన్నో కుటుంబాలకు ప్రభుత్వ పథకాల అవసరం తీరేది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుకోవాలంటే ఖాళీ అయిన ప్రభుత్వ ఉద్యోగాలన్నిటికి నియామకం జరపడం ఎవరి వల్లా కాదు. ఉదాహరణకు టెక్నాలజీ అభివృద్ధి వల్ల ప్రభుత్వ బ్యాంకులు సిబ్బంది నియామకం ఆపివేసి, ఉన్న సంఖ్యను కూడా తగ్గించుకుంటున్నాయి. బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను నింపమని ఎవరూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. అదే బాటలో

పదేండ్ల మన తెలంగాణ

రాష్ర్టాలు కూడా ఆర్థిక పరిస్థితిని అంచనా వేసుకొని అవసరం ఉన్న వాటికి మాత్రమే నియామకాలు జరుపుకొంటాయి. దుకాణం యజమాని కూడా తమ బేరాన్ని, లాభాన్ని బట్టి పనివాళ్లను పెంచుకుంటాడు, తగ్గించుకుంటాడు. ఈ రోజుల్లో ఎవరైనా లక్ష ఉద్యోగాలు ఇస్తామంటే అది సాధ్యపడని విషయమే. ఖాళీ ఉద్యోగాలు పూరిస్తామని, అందాక నిరుద్యోగ భృతి ఇస్తామని ఆశ చూపడం అంటే యువతను ఖాళీగా ఉంచడమే. అందుకోసం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి లభించే చర్యలు ముమ్మరం చేయాలి. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ప్రపంచంలోని ప్రముఖ పరిశ్రమలను రాష్ర్టానికి ఆహ్వానించి నిరుద్యోగితను తగ్గించేందుకు తీవ్రంగా కృషిచేసింది. రాష్ట్రంలో నిరంతర విద్యుత్తు, నీటి సరఫరాతో పాటు విశాలమైన రహదారులు, భారీ నిర్మాణాలకు తగిన వనరుల లభ్యత కల్పించడంతో గత కొన్నేండ్లుగా దేశంలో ఎక్కడికీ రానన్ని పరిశ్రమలు హైదరాబాద్‌కు వచ్చాయి. రాష్ట్ర ప్రాథమ్యాలైన వ్యవసాయాన్ని, దాని అనుబంధ రంగాలైన కోళ్ల, గొర్రెల, చేపల పెంపకాలను ప్రోత్సహిస్తూనే మరోవైపు హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలను నగరానికి వచ్చేలా మౌలిక సదుపాయాల వృద్ధి చేపట్టింది.

ఈ పదేండ్ల శ్రమ ఫలితంగా హైదరాబాద్ ప్రపంచపటంలో ఉత్తమ వ్యాపార కేంద్రంగా గుర్తింపబడింది. పారిశ్రామిక అభివృద్ధికి కేవలం ఐటీ రంగాన్నే నమ్ముకోకుండా ఎన్నడూ వెనుకడుగేయని ఫార్మా, జీవ విజ్ఞానం, రవాణా, టూరిజం, విద్యారంగాలపై దృష్టిసారించింది. కొత్త ఫార్మా కంపెనీల రాకతో హైదరాబాద్ ఇప్పుడు దేశంలోని మందుల ఎగుమతుల్లో 20 శాతం కైవసం చేసుకున్నది. జీవ విజ్ఞాన పరిశోధనలు హైదరాబాద్‌ను విశ్వనగర స్థాయికి తీసుకువెళ్లాయి. ప్రాణాంతక వ్యాధులకు మందులు, వాక్సిన్లు తయారుచేసే నోవార్టిస్ లాంటి కంపెనీలు మన నగరంలో తన పరిశోధనలు మొదలుపెట్టాయి. మెడికల్ డివైజ్ పార్క్, ఫార్మా సిటీ వైద్య పరిశోధనలకు ప్రత్యేకమైనవి. ఈ రెండింటిలో సుమారు 6 లక్షల ఫార్మా నిపుణుల అవసరం ఏర్పడుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా విదేశీ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. దేశంలోని ప్రధాన ఏడు నగరాల్లో రియల్ ఎస్టేట్ విదేశీ పెట్టుబడుల్లో 32 శాతం నగరానికే దక్కింది. పర్యాటకరంగాన్ని కూడా ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకున్నది. అందమైన హైదరాబాద్ నగరాన్ని గత సంవత్సరం 2 లక్షల విదేశీ పర్యాటకులు సందర్శించారు. దాని వల్ల రూ.26 కోట్ల రాష్ట్ర రెవెన్యూ పెరిగిందని రైల్వే టూరిజం సంస్థ చెప్పింది. 2016లో స్థాపించిన ఐటీ హబ్ ద్వారా ఇప్పటికే 5 వందల స్టార్టప్ కంపెనీలు అనుమతులు పొందాయి. విదేశాల్లోని భారతీయులు, అక్కడ చదువు పూర్తయిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మన ఐటీ హబ్‌లో తమ అరంగేట్రానికి వస్తున్నారు. ట్రిపుల్ ఐటీ, ఐఎస్‌బీ, నల్సార్ సంస్థల సమన్వయంతో భిన్న పరిశ్రమల స్థాపనకు నగరం కేంద్రమైంది. ఇలా గత పదేండ్లలో ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, తద్వారా ఎన్నో రంగాలకు పని కల్పన, యువతకు ఉపాధి అవకాశాల సృష్టికి రంగం సిద్ధం చేసింది. దాని ఫలితాలు వస్తుండగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి.

**ఒక ఇంటర్వ్యూలో కేటీఆర్ 'ఇన్ని కంపెనీలను, పెట్టుబడులను రాష్ర్టాలకు తెస్తున్న మీకు సంక్షేమ పథకాలు కొనసాగించే అవసరం ఏమొచ్చింది?' అనే ప్రశ్నకు 'ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళికలు ఇప్పుడిప్పుడే ఫలితాలనిస్తున్నాయి. రాష్ర్టానికి వచ్చిన కంపెనీలు పూర్తిస్థాయిగా ఎదిగి ఉపాధి కల్పించే దాకా ఓట్ల కోసమైనా పథకాలు తప్పవు. గెలవాలంటే ఓట్లు కావాలి. గెలిస్తేనే ఏమైనా చేయవచ్చు' అని అన్నారు. రాష్ట్ర ఓటర్ల ఆలోచనాసరళిని అంచనా వేసి చెప్పిన సమాధానం అది.**

అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా తెలిసిన వారు కాబట్టి ఈ ఎన్నికల సమయంలో హామీల వేలం పాటలో పోటీ పడలేదు. ఇంత అనుభవం, దూరదృష్టి ఉండి అరణ్యవాసంలా పాలనకు దూరమైన బీఆర్ఎస్‌పై ప్రతిపక్షంగా ఎన్నో బాధ్యతలున్నాయి. రాష్ర్టానికి వచ్చిన కంపెనీలకు ఒప్పందం మేరకు సదుపాయాలు కల్పించి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరం కొత్త ప్రభుత్వంపైన ఉన్నది.

## అన్నదాత పోరుబాట

రైతుల కోసం పోరాడాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గులాబీ శ్రేణులు రోడ్డెక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. 'మేమున్నా' మంటూ రైతుకు వెన్నుదన్నుగా నిలిచారు. దీంతో భారత రాష్ట్ర సమితి అంటే భారత రైతు సమితి అని మరోసారి రుజువైంది.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుల పక్షాన నిలబడింది. దండుగన్న వ్యవసాయాన్ని కేసీఆర్ పండుగలా చేశారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. నీళ్లు, కరెంట్, పెట్టుబడి సాయం ఈ మూడు వ్యవసాయానికి ప్రధాన వనరులని భావించిన కేసీఆర్ వాటిని రైతులకు సక్రమంగా అందించినప్పుడే వ్యవసాయ రంగం వృద్ధి చెందుతుందని గ్రహించారు. తద్వారా రైతుకు మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగం బాగుంటే రైతులు, రైతు కూలీలు, వ్యవసాయంతో ముడిపడి ఉన్న అనేక రంగాలు బాగుపడతాయని కేసీఆర్‌కు తెలుసు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని, కోట్లాది మందికి అన్నం దొరుకుతుందనే ఉద్దేశంతోనే ఆయన వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. కానీ, రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయం మళ్లీ మొదటికే వస్తున్నది.

రైతుకు భరోసా, వరికి బోనస్, రైతు సంక్షేమ కార్పొరేషన్ అంటూ అన్నదాతల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చినాక ఒడ్డెక్కినాక బోడ మల్లన్న తీరున వ్యవహరిస్తున్నారు. అందలమెక్కించిన రైతుల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. అరవై ఏండ్ల పాటు చేసిన దగా సరిపోదన్నట్టు మరోసారి ఆరు గ్యారంటీల పేరిట మోసం చేసింద్రు. ఐదు నెలల కాంగ్రెస్ పాలన రైతన్నల పాలిట శాపంగా మారింది. కేసీఆర్ హయాంలో తొమ్మిదిన్నరేండ్ల పాటు సల్లగా బతికిన రైతన్నలు ఐదు నెలలకే కంట నీరు తీస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే, కనీసం పంటను కొనుగోలు చేయకపోతే రైతుల గుండె మండదా మరి? అందుకే రాష్ట్రవ్యాప్తంగా రైతులు కదం తొక్కింద్రు.

రైతు భరోసా కింద పెట్టుబడి డబ్బులు ఇస్తానన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక చేతులెత్తేసింది. దీంతో ఎన్నో తిప్పలు పడి, అప్పులు చేసి రైతులు సాగు చేస్తే నీళ్లందక పంటలు ఎండిపోయాయి. కొద్దోగొప్పో వరి పంట పండితే వడగండ్ల వానతో రాలిపోయిన వడ్ల గింజలు మడిలోనే మొలకెత్తినయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రైతులు పండించిన కొద్దిపాటి పంటను మార్కెట్‌కు తీసుకుపోతే కాంగ్రెస్ సర్కార్ కొనడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులుగా పేరుకుపోయిన వడ్ల రాశులు అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నయి. వరదల్లో కొట్టుకపోతున్నయి.

రైతు కంట నీరు వస్తే కేసీఆర్ గుండె తడవుతుంది. రైతులకు అండగా కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ పాలికేక పెడుతుంది. ఇది తెలంగాణ రైతుల జీవన్మరణ సమస్య. రైతు పక్షపాతి అయిన కేసీఆర్ చూస్తూ ఊరుకుంటారా? కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచయినా సరే, రైతు పక్షాన పోరాడి చివరి గింజ వరకు కొనుగోలు చేయిస్తారు.

చిటుకుల మైసారెడ్డి
94905 24724

# విద్యావంతులు బీఆర్ఎస్ వైపే!

**అబద్ధపు హామీలు, దుష్ప్రచారాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నల్గొండ- వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే పంథాను కొనసాగిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, కేసీఆర్‌పై బురదజల్లుతూ మరోసారి విద్యావంతులు, పట్టభద్రులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ, ఐదు నెలల పాలనలోనే కాంగ్రెస్ సర్కార్ మోసాలను గ్రహించిన పట్టభద్రులు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.**

జి.రాజేశ్ నాయక్
96035 79115

ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విధానం, పాలకుల అసమర్థత గురించి పండితుల నుంచి పామరుల వరకు అందరికీ అర్థమైపోయింది. గ్రాడ్యుయేట్లు ఈ విషయాన్ని గ్రహించడంలో కాస్త ముందే ఉంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని విద్యావంతులు నిశ్చయించుకున్నారు. అందులో భాగంగానే పార్టీలకు అతీతంగా అభ్యర్థులను చూసి ఓట్లు వేయాలని వారు భావిస్తున్నారు. పోటీలో ఉన్నవారిలో ఉత్తమమైన అభ్యర్థికే పట్టం కట్టాలని అనుకుంటున్నారు. ఈ తరుణంలో పోటీ చేస్తున్నవారిలో రాకేశ్‌రెడ్డి అందరికంటే ఉత్తమమైన, మెరుగైన అభ్యర్థి అనే చర్చ తెరమీదకు వస్తున్నది. రాకేశ్‌రెడ్డి లాంటి ఉన్నత విద్యావంతున్ని ఎన్నుకుంటేనే తమ సమస్యలు చట్టసభల వరకు వెళ్తాయని పట్టభద్రులు, మేధావులు, నిరుద్యోగులు భావిస్తున్నారు.

అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. గతంలో ఆయన ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించారనే విషయాన్ని విద్యావంతులు గ్రహించారు. కావాలనే పని గట్టుకొని మరీ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలపై విమర్శలు చేశారని తెలుసుకున్నారు. వ్యక్తిగత అవసరాల కోసం ఆయన పూటకో పార్టీ మారిన విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా ఎంతోమంది నాయకులు, సాధారణ ప్రజలు, వివిధ సంస్థలను బ్లాక్‌మెయిల్ చేసి, జర్నలిజం ముసుగులో ఆయన అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వ్యక్తిని చట్టసభలకు పంపిస్తే సొంత పనులను చక్కబెట్టుకుంటారే తప్ప విద్యావంతుల తరపున పోరాడరు. ఈ విషయాలన్ని ప్రస్తుతం ప్రజాక్షేత్రంలో చర్చకు వస్తున్నాయి.

ప్రశ్నించే గొంతుక అంటూ చెప్పుకొనే మల్లన్న కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశంసించారే తప్ప ఎక్కడా ప్రశ్నించలేదు. జ్యాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తలేదు. మెగా డీఎస్సీ గురించి మాట్లాడలేదు. నిరుద్యోగ భృతిపై కాంగ్రెస్ మాట తప్పినా ప్రశ్నించలేదు. పైగా 'రైతు బంధు అడిగిన వాళ్లను చెప్పుతో కొడతా' అంటూ అన్నదాతల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడారు. మొత్తంగా ఈ ఐదు నెలల కాలంలో ఆయన చేసింది ప్రభుత్వాన్ని ప్రశంసించడం, ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్‌ను విమర్శించడమే.

యువత, విద్యావంతుల సమస్యలపై పోరాడాలంటే నాయకులలో పట్టుదల, దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు ఉండాలి. విద్యావంతులకు కావాల్సింది ప్రశ్నించే గొంతుక. ఆ విషయంలో రాకేశ్‌రెడ్డిని మించినవారు లేనే లేరు. ఉద్యోగ నోటిఫికేషన్లు సహా నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించాలంటే ఆయనతోనే సాధ్యపడుతుంది. రాకేశ్‌రెడ్డిపై ఎలాంటి అవినీతి మరకలు లేవు, వివాదాలు లేవు. ఆయనది మచ్చలేని వ్యక్తిత్వం. అందుకే రాకేశ్‌రెడ్డిని గెలిపించి బీఆర్ఎస్‌ను మరింత బలపరచాలని విద్యావంతులు భావిస్తున్నారు.

# గుకేశ్ ఓ ప్రభంజనం

**పన్నెండేండ్లకే గ్రాండ్ మాస్టర్‌గా నిలిచి, 17 ఏండ్ల వయస్సులో కెనడాలో నిర్వహించిన 'క్యాండిడేట్స్ టోర్నీ'లో గెలిచి, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో చెస్ దిగ్గజాలతో తలపడే అర్హతను సాధించిన దొమ్మిరాజు గుకేశ్ విజయ ప్రస్థానం నేటి యువతరానికి ప్రేరణాత్మకం, అనుసరణీయం. పిన్న వయస్సులోనే 64 గళ్ల చదరంగ కురుక్షేత్రంలో పావులను రామబాణాలుగా సంధించడం, ప్రత్యర్థులకు చెమటలు పట్టించడం తన 7వ ఏట నుంచే చేసిన సాధనా ఫలమే. ఎత్తులకు పైఎత్తులు వేయడంలో దిట్ట అయిన గుకేశ్ ప్రపంచ చదరంగ సమరానికి సై అంటూ పావుల కత్తులను నూరుకుంటున్నాడు.**

డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి
99497 00037

చెన్నైలో స్థిరపడిన డాక్టర్ రజనీకాంత్ (ఈఎన్‌టీ సర్జన్), పద్మ (మైక్రోబయాలజిస్ట్) దంపతులకు 2006లో దొమ్మరాజు గుకేశ్ జన్మించాడు. గుకేశ్ తల్లిదండ్రులు తెలుగువారు కావడం విశేషం. ఏడేండ్ల వయస్సులోనే చదరంగ క్రీడకు పేరుగాంచిన వేలమ్మాల్ స్కూల్‌లో ఓనమాలు దిద్దాడు. 64 గళ్ల బోర్డుపై అలుపెరుగని మెలకువలు ఒంట పట్టించుకుంటూ అంచెలంచెలుగా ఎదిగాడు. తొలిసారి అండర్-09 ఆసియా స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్ చేజిక్కించుకొని, 2018లో అండర్-12 ప్రపంచ చదరంగ యువ ఛాంపియన్‌గా నిలిచాడు. 5 స్వర్ణ పతకాలు కొల్లగొట్టి సత్తా చాటాడు. 2020 నుంచి ప్రపంచ ప్రఖ్యాత చెస్ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్ శిష్యరికంలో రాటుదేలాడు. ఆనంద్ నేతృత్వంలోని వెస్ట్‌బ్రిడ్జ్ చెస్ అకాడమీలో చేరి ఆయన మార్గదర్శకత్వంలో మెలకువలను ఒంట పట్టించుకున్నాడు. అవిశ్రాంత కృషితో దినదిన ప్రవర్ధమానంగా ఎదిగిన గుకేశ్ అంతర్జాతీయ స్థాయికి చేరడం స్ఫూర్తిదాయకం. ఓటమినే పెట్టుబడిగా చేసుకొని అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఘనుడు గుకేశ్. 2022లో ప్రపంచ మేటి చెస్ ఆటగాడు కార్ల్‌సన్‌పై నెగ్గడం, అదే ఏడాది ఒలింపియాడ్‌లో తొలి వ్యక్తిగత గోల్డ్‌మెడల్ గెలవడం, గతేడాది జరిగిన ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించడం, నేడు 2,743 రేటింగ్‌తో రికార్డులను తిరగరాయడం గుకేశ్‌కు సర్వసాధారణమైంది. 17వ ఏటనే ఫిడే క్యాండిడేట్స్ టోర్నీ గెలిచి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన అతి చిన్న వయస్కుడిగా రికార్డును బద్దలు కొట్టారు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌తో తలబడేందుకు సిద్ధపడుతున్నాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్యాండిడేట్స్ టోర్నీ జయించిన రెండవ భారత మొనగాడిగా నిలిచిన గుకేశ్ 14 పాయింట్లకుగాను గరిష్ఠంగా 09 పాయింట్లు సాధించారు. 22 ఏండ్ల వయస్సులోనే ప్రపంచ ఛాంపియన్లుగా నిలిచిన కార్ల్‌సన్, కాస్పరొవ్‌ల సరసన చేరి వారి రికార్డులను తిరగరాసే ప్రయత్నాల్లో దూసుకుపోతున్న గుకేశ్ పట్టుదల ప్రశంసనీయం.

## ఓటేయకుంటే పన్ను వేయాలి

*ప్రభుత్వం ఇది చేయట్లేదు, అది చేయట్లేదు అని ప్రజలు చెప్తుంటారు. ఒకవేళ మీరు ఈరోజు ఓటేయనట్లయితే.. అందుకు బాధ్యత వహించేది ప్రభుత్వం కాదు, మీరే. ఓటేయనివారికి అధికంగా పన్నులు విధించేలా నిబంధనలు తీసుకురావాలి. లేదా వేరే ఏదైనా శిక్ష విధించాలి.*

*- పరేశ్ రావల్, ప్రముఖ నటుడు*

### లేఖలు

## బదిలీలు చేపట్టాలె!

**తెలంగాణలో** ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలు ఆరేండ్ల కిందట జరిగాయి. అధ్యాపకుల బదిలీ ప్రక్రియ జరిగి ఆరేండ్లు దాటిపోయింది. దీంతో ఆరేండ్లుగా అనేకమంది ఉద్యోగులు ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది సమీపంలోని పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతుండగా.. మరికొంతమంది పిల్లల చదువుల కోసం కుటుంబాలను పట్టణాల్లో వదిలేసి, పల్లెల్లో ఉంటుండటం గమనార్హం. ఎక్కువ కాలం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటుండటం వల్ల పనితీరుపై నకారాత్మక ప్రభావం చూపే ప్రమాదం ఉన్నది. జూన్ మొదటి వారం వరకు ఎన్నికల కోడ్ కొనసాగే అవకాశం ఉండటం, జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యోగుల పిల్లల చదువులకు ఆటంకం కలగకూడదనే సాకుతో ఈ ఏడాది కూడా సాధారణ బదిలీలు జరగవేమోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకొని సాధారణ బదిలీలను ఈ నెలలోనే చేపట్టాలి. జూన్ మొదటి వారంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను అందజేయాలి. ఇలా చేస్తే బదిలీల ప్రక్రియకు వారం నుంచి పది రోజుల సమయం సరిపోతుంది. పైగా సాంకేతికతను ఉపయోగించి ఆన్‌లైన్‌లో వేగంగా పూర్తి చేయవచ్చు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

**- ఏవీ రమణ, 98499 55214**

## కల్లాల వద్దే వడ్లు!

**నైరుతి** రుతుపవనాలు రాకముందే రాష్ట్రంలో వానలు షురూ అయ్యాయి. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఎక్కువయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం ఇంకా పూర్తిస్థాయిలో వడ్లు కొనకపోవడం శోచనీయం. కల్లాల వద్దే వడ్లు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎండకు ఎండుతూ వానకు నానుతూ పొలాల వద్దే ముక్కిపోతున్న వడ్లను చూసి రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ పాలకులు కనీసం వడ్లు కూడా కొనడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కల్లాల వద్ద పేరుకుపోయిన వడ్లను సేకరించి రైతాంగాన్ని ఆదుకోవాలె. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

**- అమిరిశెట్టి రాజేంద్రప్రసాద్, నగునూర్, కరీంనగర్**